● ఫ్లాగ్‌పోస్ట్ ఆవిష్కరణ

*బొల్లారం రాష్ట్రపతి నిలయం ఆవరణలో ఏర్పాటు చేసిన 120 అడుగుల ఫ్లాగ్‌పోస్ట్‌ను గురువారం ఆవిష్కరిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము*

# పారదర్శకంగా ప్రతి నిర్ణయం

● అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): సాగునీటి రంగంపై ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం తన నివాసంలో వ్యవసాయ, నీటిపారుదల రంగాలపై మంత్రులు తుమ్మల, ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. 1956 నుంచి 2014 వరకు, 2014 నుంచి 2023 వరకు నిర్మించిన ప్రాజెక్టులు, వాటి నిర్మాణ వ్యయాలు, ప్రాజెక్టుల వారీగా సాగులోకి తెచ్చిన ఆయకట్టు వివరాలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన మార్గదర్శకాలు ప్రజలకు తెలియజేసేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. ప్రాజెక్టుల అన్ని రకాల లెక్కలు పూర్తిగా ఉండాల్సిందేనని, వివరాలు ప్రజలకు తెలియకుండా దాచిపెట్టే ప్రయత్నం చేయొద్దని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి నిజానిజాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పూర్తి స్థాయి నివేదిక అందించాలని ఆదేశించారు. సమీక్షలో సీఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జీవో46ను సవరించండి

● ఉమ్మడి నల్లగొండ ఎమ్మెల్యేల విజ్ఞప్తి

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): పోలీస్ ఉద్యోగాల భర్తీకి సమంబంధించిన జీవో 46ను సవరించాలని ఉమ్మ డి నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో ఆయనను కలి సి వినతిపత్రాన్ని అందించారు. జీవో నుంచి కోడ్ నం.24 టీఎస్ఎస్పీ(5000)ను మినహాయించాలని కోరారు. సీడీ-1, సీడీ-1 ప్రకారం ఫలితాలు ప్రకటించి మెరిట్ విద్యార్థులకు న్యాయం చేయాలని విన్నవించారు. తప్పుడు ప్రశ్నలను తొలగించి మళ్లీ ఫలితాలు ఇవ్వాలన్న హైకోర్టు తీర్పును అమలు జరిగేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కుందూరు జైవీర్ రెడ్డి, పద్మావతి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బాలు నాయక్, అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల ఐలయ్య, సామ్యూల్, బత్తుల లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

# ముగ్గురు మంత్రులు.. తలోమాట

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు పంపిణీ, సరఫరాపై మంత్రులకు పూర్తిస్థాయి అవగాహన లేదని అసెంబ్లీలో తేలిపోయింది. విద్యుత్తు సరఫరాపై శ్వేతపత్రంలో ఒకలా, మంత్రులు మరోలా మాట్లాడి నిండు సభలో తమ మధ్య సమన్వయం లేని విషయాన్ని బయటపెట్టుకున్నారు. మంత్రులు పరస్పర విరుద్ధంగా మాట్లాడడంతో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టారు. ఇలా ఎవరికి తోచినట్టు వారు మాట్లాడి ప్రజల్లో చులకన కావొద్దని, మంత్రులు ముగ్గురు కూర్చుని చర్చించుకుని మరోమారు శ్వేతపత్రాన్ని తయారుచేయాలని చురకలు అంటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల విద్యుత్తు ఎన్నడూ ఇవ్వలేదని, సబ్‌స్టేషన్లలో లాగ్‌బుక్‌లు పరిశీలిస్తే 9 నుంచి 12 గంటలు మాత్రమే ఇచ్చిన విషయం అర్థమవుతుందని మంత్రి కోమటిరెడ్డి అంటే, 2022-23లో ఏప్రిల్ -నవంబర్ మధ్య 19.22 గంటలు కరెంటు ఇచ్చినట్టు శ్వేతపత్రంలో పేర్కొన్నామంటూ మరోమంత్రి శ్రీధర్‌బాబు గుర్తుచేశారు. డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ గత ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇచ్చిందని శ్వేతపత్రంలో తామెక్కడా చెప్పలేదని స్పష్టం చేశారు.

# నాడు మేమిచ్చింది 6 గంటలే!

- శ్వేతపత్రంలో ఒప్పుకున్న కాంగ్రెస్
- విద్యుత్తుపై న్యాయ విచారణ జరిపించండి
- సర్కారుకు ప్రతిపక్షం సవాల్
- 200 యూనిట్ల విద్యుత్తు ఎప్పుడు?
- మోటర్లకు మీటర్లు పెడతారా? చార్జీలు పెంచుతారా?
- జగదీశ్, హరీశ్, కేటీఆర్, అక్బరుద్దీన్ ప్రశ్నలు
- జవాబివ్వలేక కాంగ్రెస్ తెల్లముఖం
- కేసీఆర్ పాలనలోనే పూర్తి ఉచిత విద్యుత్తు: కూనంనేని

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఏర్పడే సమయానికి తాము వ్యవసాయానికి ఇచ్చిన సగటు విద్యుత్తు కేవలం 6 గంటలే అని కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాన్ని ఒప్పుకొన్నది. గురువారం శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్తుపై శ్వేతపత్రాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో తాము రాష్ట్రం ఏర్పడేనాటికి 6 గంటల విద్యుత్తే సరఫరా చేశామని తెలిపింది. అంటే.. తమ పాలనలో విద్యుత్తు పరిస్థితి దారుణంగా ఉండేదని స్వయంగా ఒప్పుకున్నట్టయ్యింది. 6 గంటలు ఒకేసారి ఇచ్చారా? విడతలుగా ఇచ్చారా? ఎన్ని విడతలుగా ఇచ్చారు? అన్న విషయాన్ని మాత్రం దాచిపెట్టింది. ఆ సమాచారం కూడా శ్వేతపత్రంలో పొందుపర్చి ఉంటే, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్తు విషయంలో ఎంత ఘోరంగా వ్యవహరించిందో స్పష్టంగా అర్థమయ్యేది.

### బీఆర్ఎస్ పాలనలో సగటున 19.22 గంటలు

తెలంగాణ ఏర్పడ్డాక బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి సగటున రోజుకు సరఫరా అయిన విద్యుత్తు ఏకంగా 19.22 గంటలపాటు ఉన్నదని శ్వేతపత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొన్నది. అయితే ఇది కూడా ఒకింత తప్పే. ఎందుకంటే.. రాష్ట్రం మొత్తంపై సగటున రోజుకు ఎంత సమయం విద్యుత్తు సరఫరా అవుతోందనేది గణించి చెప్పింది. కానీ ఇందులో సాంకేతిక అంతరాయాలు, నిర్వహణ అంతరాయాలు, ఆకస్మిక అంతరాయాల గురించి చర్చించలేదు. తుఫానులు, భారీ వర్షాలు, పిడుగుపాట్లకు కలిగే అంతరాయాలు కూడా ఉంటాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని చెప్పినా 2014కు ముందు ఆ పార్టీ ఇచ్చిన 6 గంటలతో పోల్చుకుంటే 3.2 రెట్లు నిరంతరాయంగా సరఫరా చేస్తున్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వమే చెప్పినట్టైంది. ఒక సబ్‌స్టేషన్ పరిధిలో 24 గంటల నిరంతరాయ విద్యుత్తు ఉన్నప్పటికీ, పక్క సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తు, చెట్లు కొట్టడం, సాంకేతిక అంతరాయాలు ఇలా అన్నీ కలిపి 20 గంటల పాటే విద్యుత్తు ఇచ్చారనుకుంటే రెండు సబ్ స్టేషన్ల పరిధిలో సగటు సరఫరా 22 గంటలు అవుతుంది. ఇలాంటి సాంకేతిక అంశాల జోలికి పోకుండా 19.22 గంటల విద్యుత్తును సగటున అందించారని వెల్లడించింది. అయితే, గతంలో కాంగ్రెస్ పాలనలో ఈ స్థాయి కరెంటు ఇవ్వటం సాధ్యం కాలేదని తన వైఫల్యాన్ని గణాంకాలతో సహా స్పష్టం చేసింది. తెలంగాణ వచ్చాక విద్యుత్తు రంగంలో గణనీయ ప్రగతి సాధించినట్టు, ట్రాన్స్‌మిషన్, డిస్కం వ్యవస్థలను రూ.వేల కోట్లతో బలోపేతం చేసిన గణాంకాలను కూడా శ్వేతపత్రంలో పొందుపర్చారు. ఇలా మొత్తంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తన తప్పులను ఎలాంటి మొహమాటం లేకుండా ఒప్పుకున్నట్టయింది.

### అధికారపక్షం అభాసుపాలు

విద్యుత్తుపై శ్వేతపత్రం విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన అనుమానాలు, సందేహాలు, ప్రశ్నలకు మాత్రం స్పష్టమైన, నిర్దిష్టమైన సమాధానాలు చెప్పలేక నీళ్లు నమిలింది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి విద్యుత్తుపై తలాతోక లేకుండా మాట్లాడి మరోసారి అభాసుపాలయ్యారు. కేవలం విద్యుత్తు రంగంలో అప్పులు ఉన్నాయని చెప్పడం తప్పితే.. దాని వల్ల కలిగిన వ్యవస్థాపరమైన లాభాలు, ప్రజలకు కలిగిన వసతులు, ఆయా రంగాలకు ఇచ్చిన రాయితీలను ప్రతిపక్షాలు ఎత్తిచూపినా అధికారపక్షం మౌనం వహించింది. అప్పుల విషయంలో మాజీ విద్యుత్తుశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి.. 'అవును అప్పులు తెచ్చాం. అందుకే ఇప్పటికే సగం వరకు తీర్చేశాం' అని అధికారపక్ష రాజకీయ విమర్శలను తిప్పికొట్టారు. రాష్ట్రం వచ్చే నాటికి ఉన్న అప్పులు, తర్వాత తెచ్చిన అప్పులతో ఏమేం చేశారో స్పష్టంగా చెప్తూ.. కాంగ్రెస్ సర్కారు అప్పులు లేకుండా అన్ని వర్గాలకు 24 గంటల నిరంతరాయ విద్యుత్తు ఇస్తే అంత కంటే సంతోషం ఏమిటని జగదీశ్‌రెడ్డి వేసిన సెటైర్‌కు అధికారపక్షం గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది.

### అధికార పక్షంలో నిస్తేజం

బీఆర్ఎస్ సభ్యులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ అధికారపక్షంలో నిస్తేజం ఆవహించేలా విమర్శనాస్త్రాలు సంధించారు. బుధవారం ఆర్థిక పరిస్థితిపై, గురువారం విద్యుత్తుపై విడుదల చేసిన శ్వేతపత్రాల్లో అంకెల్లో తప్పులుండటాన్ని అక్బరుదీన్ ఎత్తి చూపటంతో విద్యుత్తు మంత్రి భట్టికి ఏం మాట్లాడాలో తెలియక రాజకీయ విమర్శలకు దిగారు. సిద్దిపేట, గజ్వేల్ ప్రజలను అవమానిస్తున్నారని, వారు పూర్తిగా బిల్లులు కట్టడం లేదని చెప్పడం సరైంది కాదని హరీశ్‌రావు అధికార పార్టీకి ఘాటుగా సమాధానమిచ్చారు. పెండింగ్ బిల్లులు పరిశ్రమలు, లేదా నీటిపారుదలశాఖకు సంబంధించినవి అయ్యి ఉండొచ్చని, అంతేగానీ ప్రజలు ఎప్పుడూ బిల్లులు చెల్లిస్తూనే ఉంటారని చెప్పటంతో అధికారపక్షం సైలెంట్ అయింది. కేటీఆర్ మాట్లాడుతూ.. గత కాంగ్రెస్ పాలనలో 6 గంటల కరెంటే ఇచ్చామని చెప్పటం సిగ్గుచేటని విమర్శలు గుప్పించారు. దేశంలో ఎక్కడా విజయవంతం కాని గ్యాస్ విద్యుత్తు కేంద్రాలను తామూ ప్రారంభించలేదని సహేతుకమైన సమాధానం చెప్పటంతో అధికారపక్షం గొంతు మూగబోయింది. తమ మిత్రపక్షమైనప్పటికీ సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు కాంగ్రెస్ పక్షం గాలి తీసేశారు. ఉచిత విద్యుత్తును పూర్తిస్థాయిలో అమలు చేసింది కేసీఆర్ అని స్పష్టంగా చెప్పటంతో అధికార పార్టీ నేతలకు కక్కలేక మింగలేని పరిస్థితి ఎదురైంది. భద్రాద్రి, యాదాద్రి ప్లాంటు బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాకే ఏర్పాటయ్యాయని కుండబద్దలు కొట్టారు.

### న్యాయ విచారణకు రెడీ

విద్యుత్తు నష్టాలు, కొనుగోళ్లపై న్యాయ విచారణ జరిపిస్తామని ప్రతిపక్షాలను బెదిరించాలనే వ్యూహంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆ ప్రస్తావన తీసుకొస్తే.. బీఆర్ఎస్ సభ్యుడు జగదీశ్‌రెడ్డి ఇచ్చిన సమాధానంతో అధికారపక్షం డిఫెన్స్‌లో పడింది. 'అప్పులు తెచ్చి, అభివృద్ధి సాధించాం. అందులో సగం అప్పులు కూడా తీర్చాం. తెలంగాణలో ఇంతటి అభివృద్ధికి, విదేశీ పెట్టుబడులు వస్తున్నాయంటే కారణం 24 గంటల విద్యుత్తే. విద్యుత్తు అప్పులు, కొనుగోళ్లపై తప్పకుండా న్యాయ విచారణ జరిపించాలని మేం కోరుతున్నాం' అని సభకు విన్నవించారు. దీంతో విపక్షాన్ని డిఫెన్స్‌లో పడేద్దామనుకొని ఏం మాట్లాడలేక అధికార పక్షం మౌన ముద్ర దాల్చింది.

### ప్రశ్నలకు సమాధానం కరువు

విపక్షాల ప్రశ్నలకు తెల్లముఖం వేసుకుని కూర్చున్నారేగానీ, అధికారపక్షం నుంచి ఎలాంటి సమాధానాలు రాలేదు. ముఖ్యంగా 200 యూనిట్లు ఉచిత విద్యుత్తును ఎప్పుడు ఇస్తారనే ప్రశ్నకు తెల్లముఖం వేయడమే జవాబైంది. గృహాలతో సహా అన్ని వర్గాలకు 24 గంటల విద్యుత్తును ఇస్తారా? లేదా? మీ వైఖరి ఏమిటి? అని అడిగిన ప్రశ్నకు అధికార పక్షం వద్ద సమాధానం లేకపోయింది. వ్యవసాయ రంగంలో మోటార్లకు మీటర్లు పెడతారా? మీ వైఖరి ఏమిటి? అని అడగ్గా మళ్లీ మౌనమే ఎదురైంది. కేంద్ర విద్యుత్తు సవరణల చట్టంపై కాంగ్రెస్ ప్రభుత్వ విధానం ఏమిటన్న ప్రశ్నకూ సైలెన్సే. అలాగే విద్యుత్తు చార్జీలు పెంచుతారా? అని సూటిగా అడిగిన ప్రశ్నకు కూడా సమాధానం దాటవేశారు.

# పూర్తిస్థాయి ఉచిత విద్యుత్తు ఇచ్చింది కేసీఆరే

**సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ఉచిత విద్యుత్తును పూర్తిస్థాయిలో అమలుచేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు స్పష్టంచేశారు. గురువారం అసెంబ్లీలో విద్యుత్తురంగంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2004లో వైఎస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్తును ప్రవేశపెట్టగా, కేసీఆర్ పూర్తిస్థాయిలో అమలుచేశారని వివరించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలోనే కేటీపీఎస్ మంజూరు కాగా 2014 తరువాత ప్రారంభమైందని చెప్పారు. భద్రాద్రి, యాదాద్రి విద్యుత్తు కేంద్రాలు బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఏర్పాటయ్యాయని తెలిపారు. విద్యుత్తు రంగం అప్పుల్లోకి పోయిందని, వాటిని ఎలా పూడ్చుకోవాలో ప్రస్తుత ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. రానున్న రోజుల్లో వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్తు కోసం 15 నుంచి 20 వేల కోట్లు అవసరమవుతాయని, ప్రభుత్వం ఈ నిధులు భరించకపోతే భవిష్యత్తులో రైతులకు విద్యుత్తు అందే అవకాశం లేదని, విద్యుత్తు సంస్థలు కూడా పని చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. సింగరేణిలో రూ.50-60 వేల కోట్లు పక్కదారి పట్టాయని, సింగరేణి సంస్థను కూడా జ్యుడిషియల్ విచారణ పరిధిలోకి తీసుకొని రావాలని సూచించారు.

## మీడియా పాయింట్

# ఐదేండ్లలో హామీలన్నీ నెరవేరుస్తాం

● ప్రజలకు వాస్తవాలు వెల్లడించేందుకే శ్వేతపత్రాలు: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): వచ్చే ఐదేండ్లలో మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేరుస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. అసెంబ్లీ ముగిసిన తర్వాత మీడియాపాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. పదేండ్లలో పాలకులు ప్రజలను ఎలా మభ్యపెట్టారో బయటపెట్టేందుకు విద్యుత్తు, ఆర్థికశాఖలపై శ్వేతపత్రాలు విడుదల చేశామని చెప్పారు. ప్రజలకు పరిస్థితిని తెలియజెప్పాలనే ఉద్దేశంతోనే శ్వేతపత్రాలు ప్రవేశపెట్టామని అన్నారు. రైతులకు 2004లో 7 గంటలు, 2009 వరకు 9 గంటలు ఫ్రీ కరెంట్‌ను కాంగ్రెస్ ఇచ్చిందని చెప్పారు. గత ప్రభుత్వం ప్రజల కనీస అవసరాలు తీర్చలేదని విమర్శించారు. పదేండ్లలో కొత్త రేషన్ కార్డులు ఎందుకు ఇవ్వలేదని? విద్యా వ్యవస్థకు నిధులు ఇవ్వకుండా ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. అక్బరుద్దీన్ ఒవైసీ లెక్కలకు స్పీకర్ ద్వారా సమాచారం అందజేస్తామని తెలిపారు. నేతలను కించపర్చేందుకు శ్వేతపత్రాలు పెట్టలేదని, నిజాలు చెప్పేందుకే అని అన్నారు.

*మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, విజేయుడు, వేముల, మాణిక్‌రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి*

# ఎలుక తోకనూ పట్టలేదు: జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రాలతో కొండను తవ్వి ఎలుక తోకను కూడా పట్టలేకపోయిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఎద్దేవాచేశారు. శ్వేతపత్రాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో బొక్కబోర్లా పడిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో విద్యుత్తు రంగంలో తెలంగాణ అద్భుత విజయాలు సాధించిందని చెప్పారు. తెలంగాణ రైతాంగానికి 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చామని, ఈ విషయం రైతులకు, ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. విద్యుత్తు సంస్థలకు రూ.50 వేల కోట్ల చేయూత అందించామని తెలిపారు. అసెంబ్లీలో మంత్రుల మధ్య సమన్వయం లేదని, ప్రతి అంశానికీ తెల్లముఖాలు వేశారని చెప్పారు. వాస్తవాలు చెబితే బెదిరిస్తున్నారని, వారి హయాంలో బోర్ల కోసం, నీళ్ల కోసం, పుస్తెలు.. భూములు అమ్ముకున్న రోజులను రైతులు ఇంకా మర్చిపోలేదని అన్నారు. తెలంగాణ మినహా దేశంలో ఏ రాష్ట్రం కూడా ఆరు గంటలకు మించి కరెంటు ఇవ్వలేదని తెలిపారు. జెన్‌కో ప్రాజెక్టులను ప్రభుత్వ సంస్థలకే అప్పగించామని చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పాలని, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

**తప్పుల తడకగా శ్వేతపత్రం: ఎమ్మెల్యే పల్లా**

కాంగ్రెస్ రూపొందించిన శ్వేత పత్రాలు తప్పుల తడకగా ఉన్నాయని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ప్రతిరోజూ అధికారులు ఇచ్చే నివేదికల్లోనే చాలా తప్పులు ఉన్నాయని చెప్పారు. మొదట 82 వేల కోట్ల అప్పు అని చెప్పి.. ఆ తర్వాత 78 వేల కోట్లు చూపించారని.. దీంతో వ్యత్యాసం 4,339 కోట్లు ఉందని చెప్పారు. శ్వేతపత్రాల్లో తప్పుడు గణాంకాలు ఉన్నాయని మండిపడ్డారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ అప్పుల్లో తేడాలు గుర్తించి, ప్రభుత్వం దృష్టికి తెచ్చినా పాలక పక్షం మొండిగా ప్రవర్తిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్థసత్యాలతో బీఆర్ఎస్‌ను బద్నాం చేయాలని కాంగ్రెస్ చూస్తున్నదని విమర్శించారు. ఆయన వెంట మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు విజేయుడు, కృష్ణమోహన్‌రెడ్డి, మాణిక్‌రావు ఉన్నారు.

# విద్యుత్తు వెలుగులు మావే

- కాంగ్రెస్ చేపట్టిన సంస్కరణలే కారణం
- బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు
- డిస్కంల బకాయిలతో కలిపితే 1.14 లక్షల కోట్ల అప్పులు
- ఆస్తుల విలువ మైనస్ 37%
- అసెంబ్లీలో విద్యుత్తుపై చర్చలో భట్టి

హైదరాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యుత్తు వెలుగులకు గత కాంగ్రెస్ పాలకులు చేపట్టిన సంస్కరణలే కారణమని డిప్యూటీ సీఎం, విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. విద్యుత్తు రంగానికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని, ప్రస్తుత పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన యాదాద్రి, భద్రాద్రి ప్రాజెక్టులతోపాటు ఛత్తీస్‌గఢ్ ఒప్పందంతో ఏ మాత్రం ఉపయోగం లేదని చెప్పారు. డిస్కంల బకాయిలతో కలిపి విద్యుత్తురంగంలో రూ.1.14 లక్షల కోట్ల అప్పుల భారం ఉన్నదని వివరించారు. గురువారం అసెంబ్లీలో విద్యుత్తురంగానికి సంబంధించిన శ్వేతపత్రంపై జరిగిన లఘుచర్చ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అప్పులు తెచ్చి ఆస్తులు సృష్టించామని బీఆర్ఎస్ చెప్పున్నట్టుగా వాస్తవ పరిస్థితి లేదని పేర్కొన్నారు. డిస్కంల అప్పులతో పోల్చితే ఆస్తుల విలువ మైనస్ 37 శాతం ఉన్నదని వివరించారు.

### చేసింది మేము.. చెప్పుకొనేది వాళ్లు

రాష్ట్రం ఏర్పడే నాటికి దాదాపు 5,661 మెగావాట్లుగా ఉన్న విద్యుత్తు డిమాండ్ 2023 నాటికి దాదాపు 15,500 మెగావాట్లకు చేరిందని భట్టి విక్రమార్క వివరించారు. రాష్ట్ర అవసరాలను గుర్తించిన నాటి కేంద్ర, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాలు 2014కు ముందు తెలంగాణలో జెన్‌కో థర్మల్, హైడల్, కొత్తగూడెం, కాకతీయ, లోయర్ జూరాల తదితర పనులు ప్రారంభించినట్టు తెలిపారు. విభజన చట్టం ద్వారా, ఎన్టీపీసీ ద్వారా, ఆంధ్రా నుంచి విద్యుత్తు అందేలా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఎప్పుడూ ఇవ్వలేదని, లెక్కలను మసిపూసి మారేడుకాయ చేశారని విమర్శించారు. యాదాద్రి ప్లాంట్‌ను బొగ్గు గనులకు అత్యంత దూరంలో పెట్టడంతో.. బొగ్గు సరఫరా అదనపు వ్యయమే ఏడాదికి రూ.800 కోట్లు అవుతుందని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం చేసుకున్న మేరకు కరెంట్‌ను ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. ఒప్పంద ప్రకారం విద్యుత్తు తీసుకురాకపోయినా ట్రాన్స్‌మిషన్ ఖర్చును చెల్లించాల్సి వస్తున్నదని చెప్పారు.

### 1.14 లక్షల కోట్ల అప్పులు భారం

బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్తగా నిర్మించింది 1,080 మెగావాట్ల భద్రాద్రి ప్లాంట్ మాత్రమేనని భట్టి విక్రమార్క చెప్పారు. కొత్త విద్యుత్తు ప్రాజెక్టులు కట్టకపోయినా అప్పులు భారీగా ఉన్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం విద్యుత్తుపై చేసిన రూ.86,500 కోట్ల అప్పులు, డిస్కంలకు చెల్లించాల్సిన రూ.32,497 కోట్ల బకాయిలు కలిపితే రూ.1,14,057 కోట్ల భారం భరించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. డిస్కంల పరపతి తగ్గిందని, 2021-22 నాటికి తెలంగాణ డిస్కంల నికర విలువ రూ.మైనస్ 30,876 కోట్లకు పడిపోయిందని, ఆస్తుల పెంచామని ఎలా అంటారని ప్రశ్నించారు. టీఎస్ జెన్‌కోకు 2014లో రూ.7,662 కోట్ల అప్పులుండగా ప్రస్తుతం రూ.32,797 కోట్లకు పెరిగాయని తెలిపారు. ట్రాన్స్‌కో అప్పులు రూ.2,411 నుంచి రూ.9,920 కోట్లకు, డిస్కంల రుణభారం రూ.10,783 కోట్ల నుంచి రూ.35,227 కోట్లకు పెరిగిందని వివరించారు. డిస్కంలకు ప్రభుత్వం డబ్బులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఆర్థిక ఇబ్బందులకు ప్రభుత్వశాఖల బకాయిలే కారణమని, ఇవి రూ.28,842 కోట్లు ఉన్నాయని చెప్పారు. సాగునీటిశాఖ రూ.14,193 కోట్లు బకాయిపడిందని వివరించారు. రాష్ట్రంలో విద్యుత్తు రంగ పరిస్థితి ఏమాత్రం ఆరోగ్యకరం గాలేదని తెలిపారు.

### నాణ్యమైన విద్యుత్తు అందిస్తాం

రాష్ట్ర ఆర్థిక పురోగతిలో విద్యుత్తు రంగానిదే కీలకపాత్రని, నమ్మకమైన విద్యుత్తు సరఫరానే పురోగతికి వెన్నెముక అని భట్టివిక్రమార్క పేర్కొన్నారు. అన్ని రంగాలకు నాణ్యమైన విద్యుత్తు ఇవ్వడానికి అందరి సహకారంతో ముందుకెళ్తామని, ఒల్డ్‌సిటీలో సమస్యలు పరిష్కరిస్తామని, ఇందుకోసం సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు.

# 200 యూనిట్ల హామీ అమలు ఎప్పుడు?

● బీజేపీ ఎమ్మెల్యే శంకర్

హైదరాబాద్, డిసెంబర్21 (నమస్తే తెలంగాణ): గృహలక్ష్మి గ్యారెంటీ కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందిస్తామన్న హామీని ఎప్పటి నుంచి అమలు చేస్తారని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రశ్నించారు. విద్యుత్తురంగంపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్తు కోసం అప్పులు చెయ్యడం తప్పుకాదని, వాటిని ఎలా వినియోగిస్తున్నామన్నదే ముఖ్యమని పేర్కొన్నారు. విద్యుత్తు రంగంపై ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం చూస్తే భయమేస్తున్నదని, కేంద్రం చేసిన సాయాన్ని అందులో ఎక్కడా పేర్కొనలేదని విమర్శించారు. 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇచ్చేందుకు రూ.8,820 కోట్లు అవసరమవుతాయని, విద్యుత్తు సంస్థలు నష్టపోకుండా హామీ ఎలా అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో ఎస్సీ, ఎస్టీలకు 100 యూనిట్ల ఉచిత విద్యుత్ అని ప్రకటించినా, నిర్దిత యూనిట్లు దాటితే మొత్తం యూనిట్లకు బిల్లు వసూలు చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అలా చేయకుండా 200యూనిట్ల వరకు పూర్తిగా ఉచిత్ విద్యుత్ ఇవ్వాలని, ఆపైన ఎన్ని యూనిట్లు వస్తే వాటికి మాత్రమే బిల్లు వసూలు చేయాలని కోరారు.

# కలెక్టర్ల మీటింగ్ వాయిదా

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం గురువారం నిర్వహించతలపెట్టిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ వాయిదా పడింది. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత కలెక్టర్లతో సమావేశమై ప్రభుత్వ ప్రాధాన్యాల గురించి వివరించాలని సీఎం భావించారు. ఈ మేరకు కలెక్టర్లందరికీ సమాచారం ఇచ్చారు. అసెంబ్లీ సమావేశలుండటం, సీఎం ఢిల్లీకి వెళ్లనుండటంతో సమావేశాన్ని రద్దు చేశారు.

### సీఎం ఢిల్లీ పర్యటనా వాయిదా

సీఎం రేవంత్ గురువారం సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీకి వెళ్లాల్సి ఉండగా ఆయన తన ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు.

# 'మేడిగడ్డ'లో కొనసాగుతున్న మరమ్మతు పనులు

మహదేవపూర్, డిసెంబర్ 21: కాళేశ్వరం పరిధిలోని లక్ష్మీబరాజ్ ప్రాజెక్టు పిల్లర్